# సెలవుల్లో



జె. సాయిప్రసాద్

సాయంత్రం దాదాపు ఆరున్నర గంటలు కావస్తోంది. అప్పుడే టెన్నిస్ ఆడి క్లబ్బు వరండాలో చేరాము, నేను, శ్రీనాథ్, గోపాల కృష్ణ, థామస్. అప్పటికే శర్మ కుర్చీలో చేరగిలబడి పేపరు చదువుతూ కనిపించాడు. శర్మ మా అందరికన్నా ఏడెనిమిదేళ్ళు పెద్ద వాడు. ఈ మధ్యే జరిగిన ఒక కారు ప్రమాదములో కాలు ఫ్రాక్చర్ కావడమువల్ల, టెన్నిస్‌కి తాత్కాలికంగా స్వస్తి చెప్పాడు. మంచి ఆటగాడు కూడాను. అందుకే అతని కాలు త్వరగా నయము కావాలని అతని కన్నా మాకే ఎక్కువ ఆత్రంగా వుంది.

శర్మ ఎంత మంచి ఆటగాడో అంత మంచి మాటకారి కూడా. ఆటలోను, మాట లోను నేర్పు కలవారు అరుదు కనుక అత డంటే మాకు చాల గౌరవం. తను ఏది చెప్పినా ఇతరులు ఆసక్తిగా వినేటట్లు చేయ టములో అతనికి సాటివచ్చే వ్యక్తిని నేనింత వరకు చూడలేదు.

బంతులను, రాకెట్లను బోయ్ చేతుల్లో పడేసి శర్మచుట్టూ చేరి కబుర్లు మొదలు పెట్టిన కొంచెంసేపటికి సన్నగా, గాలి వాన ప్రారంభమైనాయి. ఇంతలో లైట్లు కూడా పోవటంతో మేమంతా వరండాలోనుంచి క్లబ్బు హాల్లోకి చేరుకున్నాము. అప్పటికే అటెండర్లు కొవ్వొత్తులు వెలిగిస్తున్నారు.

'ఈ వాతావరణము చూస్తే, దాదాపు పదకొండేళ్ళక్రితం జరిగిన ఒక సంఘటన జ్ఞాపకం వస్తుందోయ్. చెప్పమన్నారా?' అని అడిగాడు శర్మ. అతడేది చెప్పినా మాకు వినాలనుంటుందని తెలిసినా, మా చేత అడి గించుకోవటం శర్మకి సరదా. తప్పకుండా, అని మేము బుర్రలాడించగానే, చెప్పడము మొదలుపెట్టాడు.

'ఇది జరిగినప్పటికి నేను బెంగుళూరులో ఇంటర్ సీనియర్ చదువుతుండేవాణ్ని. అంటే అది స్లైట్ పాంట్లు, సల్వార్ కమీజ్‌లు, ట్విస్ట్ రికార్డులులేనికాలం. అప్పట్లో మా నాన్నగారు ఆగ్రాలో పనిచేస్తుండటంవల్ల వేసవి సెలవలకి తప్ప, అక్కడికి వెళ్ళటం వీలుపడేదికాదు. జూనియర్‌లో వుండగా దసరా, క్రిస్మస్ సెలవులను ఆంధ్రదేశం లోనే వున్న మా బంధువుల ఇళ్ళల్లోనే గడిపేశాను. కాని సీనియర్‌లో వుండగా మా నాన్నగారు దసరా సెలవులకు ఊటీ వెళ్ళి తన స్నేహితులైన కర్నల్ నాయుడు

గారింట్లో వుండి రమ్మని వ్రాశారు. నాయుడుగారు ఇంతకుముందు నే నెరుగను కనుక, అక్కడికి వెళ్ళాలంటే కొంత బిడియంగానేవుంది. కాని మా నాన్నగారు నేను వస్తున్నానని నాయుడుగారికి తెలియ చేసాననికూడ వ్రాశారు. అదీకాక వెళ్ళకపోతే మా నాన్నగారు నాకు వ్రాయబోయే ఉత్తరాన్ని తలచుకొని వెళ్ళడానికే నిర్ణయించుకున్నాను.

ఊటిలో నాయుడుగారు నాకు హృదయపూర్వకంగా స్వాగతమిచ్చారు. ఆయన భార్య శాంతమ్మగారు కూడా చాలా ఆప్యాయంగా పలుకరించారు. వారికి పిల్లలు లేరు. నేను అక్కడ వున్నన్నినాళ్ళు నాకే లోటు రాకుండా చూసుకున్నారు. నాయుడుగారు చాల కలుపుగోలు మనిషి. వారింటికి చేరిన కొద్ది సేపట్లో నా బిడియాన్ని పోగొట్టి బాతాఖానిలోకి దించారు. చిన్న వయస్కులతో ఆయనంత స్నేహంగా వుండేటట్టి మనుష్యులను నే నెక్కువగా చూడలేదు.

నాయుడుగారి ఇల్లు ఊటి టవున్‌లో ఒక ప్రశాంతమైన భాగములోవుంది. ఇంటి చుట్టూ పెద్దతోట కాస్త పురాతనమైన దిలా కనిపించినా, చాలా విశాలంగా వుంది దాన్ని తను ఒక యూరోపియన్‌వద్దనుంచి కొన్నానని నాయుడుగారు చెప్పినట్లు జ్ఞాపకం. ఇద్దరు, ముగ్గురు నౌకర్లు ఇంటి పనులు చేస్తుండేవారు.

నే నక్కడ చేరిన మొదటిరోజు ఎక్కడికి వెళ్ళలేదు. ఆ సాయంత్రం, నన్ను విశ్రాంతి తీసుకొమ్మని చెప్పి నాయుడుగారు క్లబ్బుకు వెళ్ళారు.

ఆ మరుసటిరోజు ప్రొద్దున నాయుడుగారు తన కారులో ఊటిలో చూడవలసిన ప్రదేశాలన్నిటిని చూపించారు. ఊటి చాల సుందరమైన టవున్ అని వేరే చెప్పవలసిన అవసరములేదు. పూలతోటలన్ని నిండుగా కనిపించాయి. అది సెప్టెంబర్‌నెల కావడం వల్ల పగలంతా మేఘాలు కమ్మి అప్పుడప్పుడు చినుకులుకూడా పడుతున్నాయి.

మేము వూరంతా చుట్టి ఇల్లు చేరేటప్పటికి శాంతమ్మగారు మాకు భోజనం సిద్ధం చేశారు. భోజనంచేసి హాల్లో చేరి కాసేపు అవిఇవి మాట్లాడిన తరువాత, నాయుడుగారు నన్ను సాయంత్రం, తన చిరకాల మిత్రులైన డాక్టర్ శ్రీపతి గారింటికి తీసుకువెడతాను సిద్ధంగా వుండమన్నారు.

నేను, నాకని కేటాయించిన గదిలో చేరి ఏవో మాగజైన్లు తిరగేస్తూ నడుం వాల్చాను. నాకు నిద్ర ఎప్పుడు పట్టిందో తెలియదుగాని, నేను లేచేటప్పటికి దాదాపు అయిదున్నరగంటలైంది. బయట ఇంకా మేఘాలు ముసురుకొనేవున్నాయి.

తటాలున, నాయుడుగారు నన్ను సిద్ధంగా వుండమని చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. గబగబ ముఖం కడుక్కుని బట్టలు మార్చుకొని హాల్లోకి చేరాను. శాంతమ్మగారు మాత్రం సోఫాలో కూర్చుని కనిపించారు. నాకు టీ, గట్రా తెప్పించారు. తరువాత, నాయుడుగారు తన క్లబ్ మెంబరు ఒకరికి హార్ట్ ఆటాక్ రావటం వల్ల చూడ్డానికి వెళ్ళారని శాంతమ్మగారు చెప్పారు. అంతేకాకుండా నన్ను శ్రీపతిగారింట్లో వదలి రమ్మని డ్రైవరుతో కారును పంపించారు. నే నొక్కణ్ణే వెళ్ళడానికి తటాపటాయించడం చూచి శాంతమ్మగారు 'శ్రీపతిగారి కుటుంబం చాల సోషల్‌గా వుంటారని, సిగ్గుపడవలసిన అవసరంలేదని' చెప్పారు చిరునవ్వుతో.

నాకు వొక్కణ్ణే వెళ్ళడం అంతగా యిష్టం లేకపోయినా ఇక చేసేదేమి లేక నాయుడుగారి కారులో బయలుదేరాను. కారు నాకు అపరిచితం అయిన మూడు, నాలుగు రోడ్లు దాటి వూరుబయటికి సాగింది దాదాపు ఒక మైలుదూరం వెళ్ళింతరువాత ఒంటరిగా కనిపించే ఒక రెండంతస్తుల ఇంటిముందు ఆగింది. ఆ ఇంటిని చూడగానే, నేను చూసిన మిస్టరీ సినిమాల్లోని ఇళ్ళు కొన్ని గుర్తుకొచ్చాయి. అసలు విషయము ఏమిటంటే ఇది, నాయుడుగారి ఇల్లే అనుకుంటే దానికన్నా పురాతనముగా వుంది. చాలా పెద్దదనే చెప్పాలి.

నేను కారులోంచి దిగిన తరువాత, కారును మళ్ళీ ఏడు, ఏడున్నరా ప్రాంతాలలో తీసుకొనివస్తానని వెళ్ళాడు నాయుడుగారి డ్రైవరు. వరండాలోకి వెళ్ళి తలుపుతట్టిన కొద్దిసేపటికి ఒక యువతి తలుపుతెరిచింది.

ఆమె నాకన్నా రెండు, మూడేళ్ళు పెద్దదనుకుంటాను. చురుకైన ముఖముతో చాల ఆకర్షణీయంగా కనిపించింది.

'ఎవరుమీరు' అని ప్రశ్నించింది చెప్పాను.

'ఓహో, శర్మగారు మీరేనా ఇందాకే మీరు వస్తున్నారని నాయుడుగారు ఫోన్ చేసారు. లోపలికిరండి' అంటూ హాలులోకి దారితీసింది.

బయటనుంచి భీకరంగా కనిపించిన ఇంటి లోపల చాల నూతనంగాఉంది. హాల్లో ఒక పెద్దతివాచీ, రెండు సోఫాసెట్టులు, ఒక పుస్తకాల బీరువా, ఓమూల టేబులు, పైన ఫోన్, గోడలమీద ఐదారుఫోటోలు, అన్నీ చక్కగా అమర్చబడియున్నాయి. హాలులో నుంచి ఒకద్వారం ఇంటిలోపలి భాగానికి, మరొకటి పక్కనవున్న విశాలమైన తోట లోనికి తెరచుకొనివున్నాయి.

'కూర్చోండి, నాన్నగారు మేడపైన కాస్త బిజీగవున్నారు. కొంచెంసేపట్లో వస్తారు. అంతవరకు నాతో మాట్లాడటం మీకు అభ్యంతరము లేదనుకుంటాను. అన్నట్టు నాపేరు సునీత, చెప్పడము మరచాను' అని గడగడ చెప్పేసింది.

నేనొక సోఫాలో కూర్చున్నాను. ఆమె నా ముందున్న సోఫాలో కూర్చుంది. అప్పుడే గాలి, వాన మొదలుపెట్టినట్టుంది, తోటలోనుంచి చల్లగాలి నామెడవెనుక తగల సాగింది. ఏమి మాట్లాడుదామా అని అనుకుంటావుండగానే, సునీతే మొదలు పెట్టింది.

'మీకు ఊటి నచ్చిందా? అయినా, బెంగుళూరు కున్న గ్లామరు ఊటికి లేదనుకుంటాను,' తన ప్రశ్నకు జవాబుకూడా తనే చెప్పింది. నిజమేనన్నాను, ఇంకేమి తోచక.

'ఊటిలో ఇంకా ఎవరితోను పరిచయం కాలేదా మీకు'

లేదన్నాను.

ఇంతలో, గాలి, వాన ధాటికి ఇంట్లోని లైట్లు పోయాయి. సునీత నౌకరును పిలిపించి కొవ్వొత్తులు వెలిగించింది. తోట వైపు తెరచియున్న ద్వారం గుండా చినుకులు అప్పుడప్పుడు నామీద పడుతున్నాయి. సునీత ఇది గమనించి,

'తోటవైపు ద్వారం మూయనందుకు మీరు క్షమించాలి. మా నాన్నగారు వింత స్వభావులు. వారికి ద్వారాన్ని సాయంత్రం సమయాల్లో మూసివుంచడం ఏమాత్రము ఇష్టంలేదు' అన్నది బాధ మిళితమైన

క్రొత్తది!
టినోపాల్
యొక్క
మితవ్యయ ప్యాక్




*ఖాళీచేసి పారవేసే పొట్లములో.
*రెగ్యులర్ ప్యాక్‌లో కూడ లభిస్తోంది.
సర్వోత్తమ తెలుపుకోసం టినోపాల్
సుహృద్ గైగి లిమిటెడ్, బొంబాయి-1.
sgt 31/67 TL



వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టర్

రు. 265/- విలువగల ప్రపంచ ఖ్యాతి పొందిన "విండ్సర్ హిటచి" 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌ను



నెలసరి వాయిదాలపై రు. 25/- వంతున చెల్లించి పొందండి. వివరములకు :

Swiss Television Co. (AP-55)
P. O. Box 1320, Delhi-6.



తెల్ల వెంట్రుక లుండవు

పొగడడం మాకు ఇష్టంలేదు. కాని "మా కేష్ రంజన్" ఆయుర్వేదిక్ సెంటెడ్ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగామార్చును. మొదట తెల్ల వెంట్రుకలునల్లనిగామార్చి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపువృద్ధిపరచును. లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు, లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 10/-

Bengal Ayurved Bhawan (55)
P. O. Katri Sarai, (Gaya)


# సెలవుల్లో

స్వరంతో.

నాకు పెద్దగా ఆసక్తి లేకపోయినా 'ఎందుకు?' అని అడిగాను. సునీత ఇలా చెప్పసాగింది,

'ఇది విషాదగాథ అని మీకు మొదటే చెప్పాలి. ఇది జరిగి మూడేళ్ళుకావొస్తుంది. అప్పట్నుంచీ మానాన్నగారిలో ఈచలనం కలిగింది.

మా తల్లితండ్రులకు నేను, మాఅన్నయ్యలిద్దరుమాత్రమే సంతానము. మాఅమ్మ మేమంతా చిన్నవయస్సులో వున్నప్పుడే చనిపోయింది. అందుకే మానాన్నగారు మమ్మల్ని చాలాగారాబంగా పెంచారు.

మా అన్నయ్యలిద్దరికీ అడవి బాతులవేట అంటే చాలా సరదా. ప్రతిసారీ సెలవులకు వచ్చినప్పుడు ఇక్కడికి మైలుదూరంలోవున్న కొలనుకువెళ్ళి ఒక చిన్న డింగీతో వేటాడటం వాళ్ళకి మామూలే. మూడేళ్ళక్రితంకూడా అదేమాదిరిగా మా పెంపుడు కుక్కను, తీసుకొని ఒకమధ్యాహ్నంవేళ కొలనుకు వెళ్ళారు. వెళ్ళేముందు, సాయంత్రం త్వరగా వస్తామని, టీ వుంచడం మరచిపోవొద్దని కూడా చెప్పి ఆ తోటవైపు ద్వారంగుండా వెళ్ళారు. అంతే. తరువాత వాళ్ళిద్దరిని ఎవరు చూడలేదు. ఆ సాయంత్రానికి విపరీతమైన గాలివాన రేగింది. అన్నయ్యలిద్దరి కోసం ఆరోజు చాలసేపువరకు చూశాము, కాని నిష్ప్రయోజనం, గాలి. వాన మరునటి రోజు ప్రొద్దునకుగాని ఆగలేదు. వాన వెలిసిన తరువాత నాన్నగారు, పోలీసువారి సహాయంతో కొలనువద్దకు వెతకడానికి వెళ్ళారు. కాని అక్కడ అన్నయ్యలజాడేమి కనిపించలేదు. వాళ్ళు వుపయోగించే డింగీకూడ కనిపించలేదు. కొలనులో నీటిమట్టం తగ్గిన తరువాత వెతకగా, అన్నయ్యలు తీసుకొని వెళ్ళిన తుపాకులుమాత్రం బాగాతుప్పపట్టి కనిపించాయి. దానినిబట్టి మాఅన్నయ్యలిద్దరు ప్రమాదవశాత్తు కొలనులో మునిగిపోయివుంటారని, పోలీసువారు నిర్ధారణ చేశారు. అదే నిజమని నానమ్మకం. కాని నాన్నగారుమాత్రం అన్నయ్యలిద్దరు ఎప్పటికైనా తిరిగివస్తారన్న భ్రమను ఇప్పటికీ వదలలేదు.

ఆరోజు అన్నయ్యలు తుదిసారిగా బయటకు వెళ్ళినది ఈతోటవైపు ద్వారంగుండానే అందుకనే నాన్నగారు ఎప్పుడూ ఆ ద్వారాన్ని తెరిచేవుంచుతారు. నాన్నగారికి అన్నయ్యలంటే ఎంతమక్కువంటే, ఇప్పటికీ, వాళ్ళిద్దరు కొనసారిగా బయటికి వెళ్ళినప్పటి సంఘటనను గురించి విపులంగా చెబుతారు. పెద్దన్నయ్య వేసుకున్న నల్లరంగు రెయిన్ కోటునుగురించి, చిన్నన్నయ్య పెనామాకేప్ పెట్టుకొని 'ఆవారా' సినిమాలోని పాటను పదేపదే పాడుకొంటు వెళ్ళడం గురించి చెబుతూవుంటే, అది అసంభవం అయినా నాక్కూడ చనిపోయిన అన్నయ్యలు తిరిగి వస్తారేమో ననిపిస్తుంది ఒక్కొక్కప్పుడు"

ఇంతలో శ్రీపతిగారు మిద్దెనుంచి దిగి వచ్చారు. ఆయన చాల భారీ మనిషి. షుమారు యాభైయేళ్ళుంటాయి. విశాలమైన నుదురు, ఫ్రెంచ్‌కట్ మీసంతో చాలాహుందాగా కనిపించారు. అంత ఠీవిగా వుండే వ్యక్తికి సునీత చెప్పినటువంటి విచిత్రమైన భ్రమ ఎలా కలిగిందా అని నాకు ఆశ్చర్యం వేసింది.

కరచాలనం చేసినతరువాత నాగురించి కుశలప్రశ్నలు వేయసాగారు. ఇంటర్ తరువాత ఏమి చదువదలుచుకున్నది, ఎక్కడ చదువ తలుచుకున్నది మొదలైనవి అడిగారు. ఆతరువాత నేను మౌనంగా వుండటంచూసి 'సునీత అన్నయ్యలు సుధీర్, సతీష్‌వుంటే నిన్ను బాగా మాటల్లో దింపివుండేవారు, అబ్బాయ్, వాళ్ళు వేటకని కొలనుదగ్గరికి వెళ్ళారు. వచ్చేసమయంకూడా అయింది. మామూలుగా ఈతోటవైపు ద్వారంగుండానే వస్తారు. అందుకనే వానజల్లు వస్తూన్నా తలుపు వేయలేదు, ఏమి అనుకోకు. సునీత నీకీవిషయం చెప్పేవుంటుందనుకుంటాను' అని అన్నారు.

నేను చటుక్కున సునీతవైపు చూశాను. సునీతకూడా నావైపే బాధగా చూస్తోంది. 'నీబాధ గ్రహించగలనులే' అన్నట్లుగా లేని గంభీర్యము తెచ్చుకొని సన్నగా నవ్వాను. శ్రీపతిగారుమాత్రం ఇదేమి గమనించినట్లుగా లేరు. మళ్ళీ మాటలధోరణిలోపడి ఊటీ గుర్రపు పందాలను గురించి చెప్పసాగారు. నేనుకూడా పరధ్యానంగా 'ఊ' కొట్టసాగాను.

ఇంతలో దూరంగా ఓకుక్క మొరగడం వినిపించింది. శ్రీపతిగారు తోటవైపు ద్వారం

దగ్గరికివెళ్ళి, 'అదిగో సుధీర్, సతీష్ వస్తున్నారు. బాగా తడిసినట్లున్నారు. ఈ వానా కాలంలో వేటా గ్రా వద్దంటే వినరు,' అని అన్నారు విసుగ్గా.

నేను మళ్ళీ సునీతవైపు చూసి, ధైర్యం చెపుతున్నట్లుగా నవ్వుదామనుకున్నాను. కాని ఆమె సంభ్రమాశ్చర్యాలతో కళ్ళు పెద్దవి చేసి తోటలోకి చూడసాగింది. నేనుకూడా గిరుక్కున వెనుకకు తిరిగి చూసాను.

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను!! దూరంగా ఇద్దరు వ్యక్తులు, ఒక కుక్క గబగబ ఇంటివైపు రావడం కనిపించింది. వాళ్ళు కొంచెం దగ్గరకురాగానే, ఒకరు నల్లని రెయిన్‌కోటు, ఒకరు పెనామా కేప్ పెట్టుకొని భుజాలకు తుపాకులను తగిలించుకుని వుండటంకూడా గమనించాను. వాళ్ళలో ఒకరు 'గర్ ఆయా మేరా పర్‌దేశీ' అనే పాటను ఈలవేయడం కూడా వినిపించింది.

అంతే!

నేను వొక్క వుదుటున లేచి వరండా వైపు వాకిలిని తెరచికొని నా శక్తికొలది పరుగెత్తాను. నా వెనుక, 'ఆగు, ఆగు' అన్న శ్రీపతిగారి కేకలు, కుక్క బిగ్గరగా మొరగడం మాత్రం వినిపించాయి. నేను

# సెలవుల్లో

ఏ వైపు పరుగెడుతున్నది కూడా గమనించ లేదు. చీకట్లో ఏదో తీగ నా కాళ్ళకు తగలడము, నేను ఏదో చెట్టుకు బలంగా గుద్దుకోవడం నాకు లీలగా జ్ఞాపకము. తరువాత నాకు స్పృహ తప్పిపోయింది.

నేను మళ్ళీ కళ్ళు తెరచేటప్పటికి శ్రీపతిగారింట్లో ఒక మంచముమీద పడుకుని వున్నాను. నా తలకు దెబ్బ తగిలినచోట కట్టుకట్టివుంది. మంచంకు ఒక పక్కనున్న కుర్చీలలో నాయుడుగారు, ఆయన భార్య, శ్రీపతిగారు కూర్చునివున్నారు. మరో పక్కన సునీతతోపాటు కూర్చున్న ఇద్దరు యువకులను చూసి వులిక్కిపడ్డాను. ఆ ఇద్దరిని చూసే నేను గాభరాపడి పరిగెత్తింది! సునీత నా వైపు కొంటెగా చూసి నవ్వుతావుంది ఆ ఇద్దరు యువకులు కూడా చిరునవ్వుతో చూస్తున్నారు.

శ్రీపతిగారు, వాళ్ళవైపు వారిస్తున్నట్లుగా సైగచేసి, నాతో, అబ్బాయ్, నీవు స్పృహ తప్పిపడ్డ తరువాత నిన్ను లోపలికి తెచ్చి, నాయుడుగారికి ఫోనుచేసి పిలిపించాము. మా అమ్మాయి సునీత, నిన్ను ఎలా బెదరకొట్టింది మాతో చెప్పింది. అమాయకులను ఏడ్పించటం సునీతకి చిన్నప్పట్నించి ఒక హాబీగా తయారయింది.

అసలు జరిగిన దేమిటంటే, నిన్ను చూడగానే అమాయకుడుగా గుర్తించింది మా సునీత. దాంతో నీకు ఒక కట్టుకథ అల్లి నిన్ను ఇబ్బంది పెట్టింది. నీకు మా కుటుంబం విషయాలేమి తెలియవని కనిపెట్టి, సుధీర్, సతీష్ లిద్దరు ప్రమాదవశాత్తు చనిపోయినట్లు, అందువల్ల నాకు కాస్త మతి భ్రమణం కలిగినట్లుగా చెప్పింది. నిజంగా నాకు మతి భ్రమణము కలగాలేదు, నా కొడుకులు చనిపోనులేదు.

సుధీర్, సతీష్‌లు ఈ రోజు ప్రొద్దునే వాళ్ళ కాలేజిలనుంచి వచ్చారు. మధ్యాహ్నం వేటకని వెళ్ళారు. వాళ్ళు తిరిగివచ్చే సమయానికి సరిగ్గా నీకు ఆ కట్టుకథ చెప్పి, వాళ్ళు రావడం చూసి తను కూడా చాల భయపడినట్లు నటించింది. దాంతో నీవు వాళ్ళను చూసి దడుచుకొని పరిగెత్తావు.

నీవు మిస్టరీ నవలలు ఎక్కువ చదివి వుండటం, ఈ రోజున్న భీకరమైన వాతావరణం. వాటికి తోడు మా సునీత కొంటెతనం, అన్నీ కలసి నీకు ఈ ఇబ్బందిని కలిగించాయి. ఏమి అనుకోకు,' అని అన్నారు.

ఇదంతా విని నేను సిగ్గుతో కుంచించుకుపోయాను అప్పుడు సుధీర్, సతీష్‌లు ఇందులో నా లోప మేమిలేదని, సునీత కొంటెతనానికి ఎటువంటివారైనా ఇదేఅవస్థ చెందేవారని, నన్ను వూరడించారు. ఇంతలో సునీత మా అందరికి వేడివేడి కాఫితెచ్చింది.

అప్పుడు నాయుడుగారు 'ఏమమ్మా, నీవు చేసిన ఘన కార్యానికి సెలిబ్రేషనా?' అన్నారు.

అందరు గట్టిగా నవ్వారు. నేను కూడా శృతి కలపక తప్పలేదు.

ఆ తరువాత అక్కడున్నన్నాళ్ళు శ్రీపతిగారింటికి తరచుగా వెళ్ళేవాణ్ణి, నిర్భయంగా ప్రతిరోజు ఏదోవొక ప్రోగ్రాంతో చాలా సరదాగా గడిచిపోయాయి అక్కడ వున్నన్ని రోజులు.

నే నా ప్రదేశంనుంచి వచ్చిన తరువాత సంవత్సరానికి అనుకుంటాను, సునీతకు పెళ్ళయిందని తెలిసింది. ఇప్పుడా దంపతు లెక్కడున్నారో కాని, సునీత భర్తకు మాత్రం జీవితం 'బోర్' అనిపించదని నా నమ్మకం' అని ముగించాడు శర్మ. ●

